ఉచితం మాటున ఊడ్చేస్తున్నారు!

- వంకలు, వాగుల్లో ఆగని ఇసుక తరలింపు
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా దోపిడీ
- రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్న 'తెలుగు తమ్ముళ్లు'
- చోద్యం చూస్తున్న అధికారులు





పి.జలాలపురం వద్ద వంకలో ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు, గతంలో రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ఇసుక (ఫైల్)

శింగనమల: కూటమి ప్రభుత్వం కొలువైన తరువాత టీడీపీ నేతలకు ఇసుక కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వం ఇసుక ఉచితమని చెబుతున్నా.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇసుక తరలింపుతో భూగర్భజలం తగ్గిపోతుందని గ్రామస్తులు పోలీసు ఉన్నతాధికారులకు విన్నవించుకుంటే.. పోలీసులు నామమాత్రపు చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తున్నారు. ఎవరూ చర్యలు తీసుకోకపోవడంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగిస్తూ, తెలుగు తమ్ముళ్లు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ తరలింపు ఇలా..

- శింగనమల మండలంలోని కూతలేరు వంక పారుతున్న పి.జలాలపురం, పెరవలి, చీలేపల్లి, శింగనమల చెరువు మరువ నీరు పారే సోదనపల్లి వంక, పెన్నానది పరీవాహక ప్రాంతాలైన రాచేపల్లి, తరిమెల, కల్లుమడి, నిదనవాడ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పి.జలాలపురం వద్ద ఉన్న వంకకు టీడీపీ నాయకులు మూడు బ్యాచ్‌లు ఇటాచీ, జేసీబీ పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అనంతపురం, నార్పల, తాడిపత్రి వైపు తరలిస్తున్నారు. ఈ వంక నుంచి అక్రమంగా ఇసుకను తరలించడం వల్ల భూగర్భజలం తగ్గిపోతోందని, రైతులు, గ్రామస్తులు ఇసుక రవాణా చేస్తున్న వారితో వాదించి, పోలీస్ ఉన్నతాధికారులకు పట్టించినా మరుసటి రోజు నుంచే అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ వంకలో అర కిలోమీటరు వరకూ 10 అడుగుల లోతు, 100 మీటర్ల వెడల్పుతో ఇసుకను దోచేశారు. ఒకసారి ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు దాడులు చేసి, 225 క్యూబిక్ మీటర్ల ఇసుకను సీజ్ చేశారు. కాని మరుసటి రోజే ఇసుక అక్రమార్కులు సీజ్ చేసిన ఇసుక తరలించి సొమ్ము చేసుకున్నారు. అక్రమంగా తరలించినది అధికార పార్టీ నాయకులే కావడంతో రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు ఏం చేయలేకపోతున్నారు.
- గార్లదిన్నె మండలంలోని కొప్పలకొండ, కల్లూరు, ఇల్లూరు గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి రోజూ అక్రమంగా ఇసుక ట్రాక్టర్ల ద్వారా తరలిపోతోంది. ఇసుకను అనంతపురం, గార్లదిన్నె, పామిడి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.
- బుక్కరాయసముద్రం మండలంలోని నీలాంపల్లి, చెదల్ల, జంతులూరు వంక నుంచి రోజూ అనంతపురానికి అక్రమంగా 30 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
- యల్లనూరు మండలంలోని శింగవరం సమీపంలోని చిత్రావతి నది నుంచి వైఎస్సార్ జిల్లా పులివెందుల, వెలిదండ్ల ప్రాంతాలకు రాత్రిళ్లు 12 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకూ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

భూగర్భజలం తగ్గిపోతోంది



పి.జలాలపురం వంక నుంచి రోజూ ఇసుక అక్రమంగా తరలించడం వల్ల చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భజలం తగ్గిపోతోంది. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం ఇస్తూ, వాహనాలను పట్టిస్తున్నా అక్రమార్కులు ఆపడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, ఉపసర్పంచ్, పి.జలాలపురం

గస్తీ ఏర్పాటు చేశాం



శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల్లో ఇసుక అక్రమంగా తరలించకుండా గట్టి చర్యలు తీసుకున్నాం. ఇసుక తరలింపుపై సమాచారం వచ్చిన వెంటనే, నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ఇసుక రీచ్‌ల వద్ద పోలీసుల గస్తీ ఏర్పాటు చేశాం. ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కౌలుట్లయ్య, సీఐ, శింగనమల

క్లుప్తంగా

పైప్‌లైన్ లీకేజీలను అరికట్టండి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తాగునీటి సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక 60 అడుగుల రోడ్‌లో పైప్‌లైన్ మరమ్మతులను ఆయన పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి పైప్‌లైన్ లీకేజీలుంటే వెంటనే అరికట్టాలన్నారు. అంతకుముందు ఆయన 60 అడుగుల రోడ్, హనుమేష్‌నగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే పన్ను వసూలు స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొని.. అత్యధికంగా ఆస్తి పన్ను బకాయిలున్న వారిని కలసి పన్ను వసూలు చేశారు.

నాటుసారా తయారీ కేంద్రంపై దాడి



బెల్లం ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

గుంతకలు రూరల్: మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండా గ్రామ శివారులో నిర్వహిస్తున్న నాటుసారా తయారీ కేంద్రంపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ సీఐ శివసాగర్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టి అక్కడి నుండి పరారైన నిందితుడు గోపాల్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక




ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం

బుక్కరాయసముద్రం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు బీకేఎస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. నగరంలో ఇటీవల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్, బేస్‌బాల్, పోటీలు నిర్వహించారన్నారు. అండర్-14 బాలుర విభాగంలో కిరణ్‌కుమార్, వెంకటేష్ నాయక్, రాజేష్ నాయక్, మహేష్ బాబు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో నాగ నందిని, లక్ష్మీ ప్రసన్న, ఎంపికయ్యారన్నారు. బేస్‌బాల్ బాలురు విభాగంలో ధనుష్ ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఓ యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టోపీ పీరా అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష రసాయనం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'పీఎం ఆవాస్'పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోత్స్న

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో గురువారం పీఎం ఆవాస్ యోజన గ్రామీణ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ తేజోత్స్న మాట్లాడారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద లబ్ధిదారులకు చేకూరే ప్రయోజనాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జీ వీరాంజనేయులు, హౌసింగ్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

గుత్తి/పుట్లూరు/పెద్దవడుగూరు: అనంతపురంలో ఈ నెల 26న తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు కోరారు. సీఐటీయూ, సీపీఎం నాయకులు తలపెట్టిన జీపు జాతా గురువారం గుత్తికి చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర కుమార్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, గుత్తి మండల సీఐటీయూ కార్యదర్శి నిర్మల మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న అనంతపురంలో భారీ మహాధర్నా చేపట్టామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరులో సీపీఎం నాయకులు సూరి, వెంకటచౌదరి, పెద్దయ్య, భాస్కర్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి డిమాండ్ చేశారు. అలాగే సీపీఎం చేపట్టిన జీపుజాతా పెద్దవడుగూరుకు చేరుకోవడంతో సీపీఎం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, దస్తగిరి, ఈశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరించాయని మండిపడ్డారు.



గుత్తిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

వైఎస్ జగన్‌ను కలసిన ఆలూరు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఆలూరు సాంబశివారెడ్డి, నాయకులు

శింగనమల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు కలిశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి, పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మండల నాయకులు కలిశారు.

నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని జగన్ అడిగి తెలుసుకున్నారు.

జీఓ 36 మేరకు వేతనాలు చెల్లించాలి



గుంతకల్లులో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ విభాగ కార్మికులు



తాడిపత్రిలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

గుంతకల్లు టౌన్/తాడిపత్రి రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న చిరుద్యోగులు, కార్మికులకు జీఓ.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని గుంతకల్లులో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను ఆప్కాస్ ఇంజనీరింగ్ విభాగపు కార్మికులు కోరారు. గురువారం యూనియన్ నాయకులు మల్లేష్, సురేష్, మస్తాన్, ఓంకార్ తదితరులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లుగా విభజించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని వారు విన్నవించారు. కార్మిక నాయకులు సూర్యవర్ధన్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలో కమిషనర్ శివరామకృష్ణకు సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులు జుబేర్, మహబూబ్‌బాషా, కోశాధికారి జీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విభాగం కార్మికులు వినతిపత్రం అందజేశారు.

దాతల సాయం నిరుపయోగం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి దాతల సాయంతో వచ్చిన ఎక్స్‌రే మిషన్ నిరుపయోగంగా మారింది. గత మార్చి నెలలో స్థానికంగా ఉన్న అర్జాస్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆస్పత్రికి వచ్చే రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.14 లక్షల విలువైన 300 ఎంఏ ఎక్స్‌రే మిషన్‌ను అందజేసింది. అయితే ప్రజల వినియోగానికి తీసుకురావాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో దాదాపు సంవత్సర కాలంగా ఎక్స్‌రే మిషన్ నిరుపయోగంగా గదికే పరిమితం అయింది. ఆస్పత్రిలో 100 ఎంఏ ఎక్స్‌రే మిషన్‌తోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని క్లిష్టమైన ఎక్స్‌రేల కోసం వైద్యులు ప్రైవేట్ డయాగ్నస్టిక్స్‌కు పంపుతుండటంతో పేదల జేబుకు చిల్లు పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి 300 ఎంఏ ఎక్స్‌రే మిషన్‌ను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.



ఎక్స్‌రే మిషన్ ఉన్న గదికి తాళం వేసిన దృశ్యం

డీఎస్పీ ఆదేశాలు బేఖాతర్..

తాడిపత్రిటౌన్: తాడిపత్రి డీఎస్పీ రామక్రిష్ణుడు ఆదేశాలను ధాబా యజమానులు పట్టించుకోవడంలేదు. ధాబాల్లో మద్యం సేవించకూడదని యజమానులకు ఇటీవల మీటింగ్ పెట్టి డీఎస్పీతోపాటు సీఐలు సాయిప్రదీప్, శివగంగాధర్‌రెడ్డి ఆదేశాలిచ్చినా ధాబాల్లో యథేచ్ఛగా మందుబాబులు మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. నంద్యాల రోడ్డు, ఆంజనేయస్వామి విగ్రహం, క్రిష్ణాపురం రోడ్లపై ఉన్న మద్యం షాపుల వద్ద మందుబాబులు పట్టపగలే రోడ్లపై మద్యం సేవిస్తున్నారు. రాత్రి అయితే మరీ శ్రుతి మించి రోడ్డు డివైడర్లపై, మద్యం షాపుల ముందే సిట్టింగ్ వేసి మరీ మద్యం సేవిస్తున్నారు. మహిళలు, చిన్నపిల్లలు అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పోలీసులు స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



తాడిపత్రిలోని ఓ ధాబాలో మద్యం సేవిస్తున్న దృశ్యం



నంద్యాల రోడ్డులో దుకాణం ముందే తాగుతున్న మందుబాబులు

స్థలాల పంపిణీ అవకతవకలపై విచారణ

గుత్తి: మండలంలోని కరిడికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బాచుపల్లిలో 2023లో ఇంటి స్థలాల పంపిణీ విషయంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై గురువారం విచారణ బృందం సభ్యులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. బాచుపల్లిలోని సర్వే నంబర్లు 179, 179ఎ, 188లో సుమారు నాలుగు ఎకరాల్లో మొత్తం 118 మందికి రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. రెవెన్యూ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడి ఒక్కొక్కరితో రూ.మూడు లక్షలు వసూలు చేసి అనర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారని, అలాగే 8వ విడత భూ పంపిణీలో కూడా అక్రమాలు జరిగాయని గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన గద్దల మస్తానప్ప అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. వీటిపై విచారణ చేసి నివేదిక పంపాలని లోకాయుక్త అధికారులు గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించారు. వెంటనే ఆయన యాడికి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మరో ఏడుగురితో కూడిన విచారణ బృందాన్ని నియమించారు. ఈ నేపథ్యంలో విచారణ బృందం సభ్యులు బాచుపల్లికి వెళ్లి ఇంటి స్థలాలు, భూముల పంపిణీలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ చేశారు. నివేదికను ఆర్డీఓకు అందజేయనున్నట్లు విచారణ బృందం సభ్యులు తెలిపారు.



బాచుపల్లిలో విచారణ చేస్తున్న అధికారులు

వేతనాలు చెల్లించాలని ఆర్డీకి వినతి

గుంతకల్లు: గుంతకల్లు మున్సిపల్ పారిశుధ్య క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు రాజేష్, జిల్లా మున్సిపల్ పారిశుధ్య యూనియన్ అధ్యక్షుడు జీ.చిరంజీవి తదితరులు మాట్లాడుతూ గుంతకల్లు మున్సిపల్‌లో పనిచేసే క్లాప్ ఆటో డ్రైవర్లకు గత 11 నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాల చెల్లింపు విషయమై సంబంధిత ఏజెన్సీ వారు మీ మున్సిపల్ కమీషనర్‌తోనే జీతాలు ఇప్పించుకోండి అంటూ ఒకరిపై ఒకరూ చెప్పుకుంటున్నారని ఆరోపించారు. దీంతో వారి కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. అనంతరం ఆర్డీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కృష్ణుడు, క్లాప్ ఆటోడ్రైవర్లు సాయి, రాజు వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాగునీరు వృథా..



పైప్‌లైన్ లీకేజీ అవుతున్న దృశ్యం



వృథాగా పోతున్న తాగునీరు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని మేధా స్కూల్ ఏరియాలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సంబంధించిన పైప్‌లైన్ గురువారం ఉదయం లీకేజీ అయింది. సుమారు ఐదు చోట్ల పైప్‌లైన్ లీకేజవడంతతో తాగునీరంతా వృథాగా పోయింది. కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో సుమారు పది గంటల పాటు తాగునీరు వృథాగా పోయింది.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ మోహన్ రెడ్డి

గుత్తి: గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సీఐగా గురువారం మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న శివసాగర్ గుంతకల్లుకు బదిలీ అయ్యారు. మడకశిర మొబైల్ పార్టీలో సీఐగా పని చేస్తున్న మోహన్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐ మాట్లాడుతూ మద్యం బెల్టు షాపులు, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, సారా తయారీ, రవాణ, విక్రయాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు. అతడికి ఎస్ఐలు అస్లామ్ బేగ్, గోపాల్, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బ్లాక్ స్పాట్ల పరిశీలన



బ్లాక్‌స్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ

తాడిపత్రి రూరల్: ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్‌స్పాట్‌లను గురువారం సాయంత్రం డీఎస్పీ రామకృష్ణుడు పరిశీలించారు. మండలంలోని యర్రగుంటపల్లి, కడపరోడ్డు, చుక్కలూరు రోడ్డులను పరిశీలించి అధికారులకు సూచనలు అందచేశారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడిపత్రి రూరల్: మండలంలోని పెన్నానది నుంచి గురువారం ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు మండలంలోని చుక్కలూరు, బుగ్గ వద్ద సిబ్బందితో కలిసి దాడులు జరిపామన్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

'ఏఈని సస్పెండ్ చేయాలి'

తాడిపత్రిటౌన్: యల్లనూర్ ట్రాన్స్‌కో ఏఈని సస్పెండ్ చేయాలని ఏపీ రైతుసంఘం కార్యదర్శి రాజారాం డిమాండ్ చేశారు. ఈ నెల 20న యల్లనూరు మండలంలోని దంతాలపల్లి వద్ద పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన రామాంజనేయులు, అతని కుమారుడు రవి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన తెలిసిందే. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం సంభవించిందని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు చనిపోయిన ఒక్కొక్కరికి రూ.60 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో డీఈ వసంతయ్యకు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బనానా రైలు' ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ప్రారంభం కానున్న బనానా రైలు ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పరిశీలించారు. స్థానిక రైల్వే స్టేషన్‌కు గురువారం ఆయా శాఖ అధికారులతో కలసి వచ్చారు. తాడిపత్రి నుంచి ముంబయికి ఏసీ కంటైనర్లల్లో అరటి కాయలను రవాణా చేయనున్నారు. అక్కడి నుంచి అరబ్ దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు జేసీకి ఎస్‌కే కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా జేసీ విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ మంత్రితో పాటు ఇతర మంత్రులు వర్చువల్‌గా బనానా రైలును ప్రారంభిస్తారన్నారు. అనంతరం మండలంలోని చుక్కలూరు వద్ద గల సిద్ధార్థ కోల్డ్‌స్టోరేజిని పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ కేశవ నాయుడు, హార్టికల్చర్ డీడీ నరసింహరావు, స్టేషన్ మాస్టర్ అనిల్ కుమార్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రం శింగనమల క్రాస్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మర్తాడుకు చెందిన పెన్నోబులేసు అనే వ్యక్తి శింగనమల నుంచి గార్లదిన్నెకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. శింగనమల క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు గాయపడ్డాడు. స్థానికులు అతడిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722,
9010588846, 9010223701